RNI NO. TELTEL2010/34557

www.deshatimes.in

# దేశ టైమ్స్
DESHA TIMES

తెలుగు దిన పత్రిక

నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES

16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 14 శుక్రవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 191 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష

NALGONDA | FRIDAY AUGUST 14 2026 | VOL:16 | ISSUE: 191 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం

ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం ఆదేశం

కాళేశ్వరం బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ సూచనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం

భూ నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించేందుకు కార్యాచరణకు ఆదేశం




గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం

(మిగతా 2వ పేజీలో..)

## మోదీ, రాహుల్ గాంధీ సభలో ఉండగా.. పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం!



ఆరు చరణాల జాతీయ గేయం ఆలాపన

ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ సహా సభ్యుల హాజరు

'వందేమాతరం'కు చట్టబద్ధ రక్షణ వచ్చిన కొద్ది రోజులకే ఘటన

రాజ్యసభ కూడా 'వందేమాతరం'తోనే ముగింపు


చివరి రోజు సైతం విపక్షాల నిరసనలు

పార్లమెంట్ చరిత్రలో గురువారం అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. వర్షాకాల సమావేశాల చివరి రోజు లోక్‌సభ కార్యకలాపాలు తొలిసారి 'వందేమాతరం'తో ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సహా సభ్యులంతా సభలో ఉండగా ఆరు చరణాల జాతీయ గీతాన్ని ఆలపించారు.'వందేమాతరం' ఆలాపన పూర్తయ్యాక లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. రాజ్యసభ కూడా జాతీయ గేయంతోనే సమావేశాలను ముగించింది. దీంతో పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం నమోదైంది.'వందేమాతరం'కు చట్టబద్ధ రక్షణ కల్పించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం

(మిగతా 2వ పేజీలో..)

## జమ్మూకశ్మీర్‌లో భారీ భూకంపం..

హైదరాబాద్ : జమ్మూకశ్మీర్‌లోని లేహ్(లద్దాక్)లో గురువారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 5.5 మ్యాగ్నిట్యూడ్‌గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఆఫ్ సిస్మాలజీ వెల్లడించింది. ఈ భూకంపం వల్ల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ భూకంపం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదు.



## గతంలో కోర్టుకెళ్లిన మీరే.. ఇప్పుడు అవే భూములను ఎలా వేలం వేస్తారు?: సీఎంను ప్రశ్నించిన హరీశ్ రావు

రాయదుర్గం భూముల వేలం తక్షణమే ఆపాలని సీఎంకు హరీశ్ రావు లేఖ

అవి వారసత్వ, వివాదాస్పద భూములని లేఖలో స్పష్టీకరణ

గతంలో ఇదే భూముల కోసం కోర్టుకెక్కిన రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్

యాజమాన్య హక్కులు తేలకుండా వేలం వేయడంపై తీవ్ర అభ్యంతరం

ఎస్బీఐ, వక్ఫ్ బోర్డు కేసుల నేపథ్యంలో వేలం నిర్ణయంపై విమర్శలు



హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని అత్యంత విలువైన రాయదుర్గంలో 10.63 ఎకరాల వారసత్వ భూమి వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి (మిగతా 2వ పేజీలో..)

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సుప్రీంకోర్టుకు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసును విచారించాలని అలహాబాద్ కోర్టు.. సీబీఐ, ఈడీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఆగస్టు 17వ తేదీన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం విచారించనున్నది. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ఆస్తులపై సీబీఐ ఇచ్చిన వివరణ పట్ల గతంలో అలహాబాద్ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణకు చెందిన కొత్త అఫిడవిట్‌ను దాఖలు చేయాలని జూలై 20వ తేదీన లక్నో బెంచ్ ఆదేశాలు జారీ చేసింది.


(మిగతా 2వ పేజీలో..)



## ఖర్గే సభ జరిగిన చోట 'శుద్ధి'.. రాజ్యసభలో రగడ

హైదరాబాద్ : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశంలో 'శుద్ధీకరణ' పేరుతో హోమం చేయడం రాజకీయ దుమారం రేపింది. ఈ అంశం గురువారం రాజ్యసభను కుదిపేసింది. ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయగా.. కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. బీజేపీ ఇలాంటి చర్యలను సమర్థించదని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని

(మిగతా 2వ పేజీలో..)



## చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జ్‌కు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి: సీఎం రేవంత్ రెడ్డికి వీహెచ్ లేఖ

చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు కొత్త స్టీల్ బ్రిడ్జ్

సంగం లక్ష్మీబాయి సేవలు చరిత్రలో మరువరానివన్న వీహెచ్




## సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం సందర్భంగా చంద్రబాబు తీవ్ర భావోద్వేగం

అమరావతి రైతులది త్యాగం మాత్రమే కాదు.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అన్న చంద్రబాబు

శూన్యం నుంచి గొప్ప రాజధానిని నిర్మించుకునే స్థాయికి చేరుకున్నామని వ్యాఖ్య

గ్రాఫిక్స్ అన్నవాళ్లు ఇక్కడకు వచ్చి చూడాలన్న చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఈ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశతో పాటు, విజయవాడ-మంగళగిరి హైవేను అనుసంధానిస్తూ బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన నూతన స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించారు. ఉండవల్లి వద్ద ప్రత్యేక శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం, అనంతరం స్వయంగా



కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జి నిర్మాణాలు, రహదారి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రైతులు, స్థానికులను ఉద్దేశించి ఆయన అత్యంత భావోద్వేగంగా ప్రసంగించారు.

(మిగతా 2వ పేజీలో..)

తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## మోదీ, రాహుల్ గాంధీ సభలో ఉండగా.. పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం!

మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, పాడకుండా నిరోధించడం నేరంగా పరిగణించేలా కొత్త చట్టం తీసుకొచ్చారు.కేంద్ర హోంశాఖ జనవరి 28న 'వందేమాతరం' ఆలాపనపై మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాక ఆవిష్కరణ, గవర్నర్ల ప్రసంగాలు వంటి సందర్భాల్లో ఆరు చరణాలు ఆలపించాలని అందులో సూచించింది.అయితే వర్షాకాల సమావేశాలు మాత్రం తీవ్ర రాజకీయ వేడితో సాగాయి. జులై 20న సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి పలు అంశాలపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. సభా కార్యక్రమాలు పలుసార్లు స్తంభించాయి.చివరి రోజు కూడా విపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర ద్వారం వద్ద బీజేపీ, విపక్షాలు వేర్వేరుగా నిరసనలు చేపట్టాయి. ఈ గందరగోళం మధ్యే 'వందేమాతరం'తో సభ ప్రారంభం కావడం ఈ సమావేశాల చివరి రోజుకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సుప్రీంకోర్టుకు రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి)

ఈడీ విచారణ సమయంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏవైనా డాక్యుమెంట్లు సేకరించారా అని కూడా హైకోర్టు ప్రశ్నించింది. కర్నాటక నివాసి ఎస్ విఘ్నేశ్ సిసిర్ దాఖలు చేసిన రిట్ పిటీషన్ ఆధారంగా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉన్నట్లు కూడా గతంలో విఘ్నేశ్ ఓ పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## ఖర్గే సభ జరిగిన చోట 'శుద్ధి'.. రాజ్యసభలో రగడ

మొదటి పేజీ తరువాయి)

హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8న ఖర్గే 'విజయ శంఖనాద' సభ నిర్వహించారు. రెండు రోజుల తర్వాత శ్రీరామ్ సేనకు చెందిన కార్యకర్తలు అక్కడ హోమం చేసి వేదికను 'శుద్ధి' చేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. రాజ్యసభలో ఖర్గే మాట్లాడుతూ.. తన సభకు లక్షలాది మంది హాజరయ్యారని చెప్పారు. తాను ఏ మతం లేదా వర్గం గురించి మాట్లాడలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే మాట్లాడానని తెలిపారు. అయినా తన ప్రసంగం తర్వాత వేదికకు శుద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య పద్ధతేనా? రాజ్యాంగాన్ని ఎలా కాపాడుతున్నారని నిలదీశారు. ఈ ఘటనను ఖండించిన రాజ్యసభ ఛైర్మన్.. అంటరానితనం కంటే పెద్ద పాపం మరొకటి లేదని వ్యాఖ్యానించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

## చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జ్‌కు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి: సీఎం రేవంత్ రెడ్డికి వీహెచ్ లేఖ

మొదటి పేజీ తరువాయి)

మూడుసార్లు ఎంపీగా గెలిచిన తొలి మహిళగా రికార్డు సృష్టించారని కితాబు

హైదరాబాద్ నగర పరిధిలోని చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు నూతనంగా నిర్మించిన స్టీల్ బ్రిడ్జ్‌కు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, విద్యావేత్త సంగం లక్ష్మీబాయి పేరుతో నామకరణం చేయాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా లేఖ రాశారు.భారత స్వాతంత్ర్య పోరాటంలో, ఆ తర్వాత సమాజ సేవలో సంగం లక్ష్మీబాయి అందించిన నిరుపమాన సేవలు చరిత్రలో మరపురానివని వీహెచ్ తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ నేలకు చెందిన వీరనారిగా, నిజాం నిరంకుశత్వానికి, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే కాకుండా, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారని పేర్కొన్నారు.స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా అల్వాల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఉప విద్యామంత్రిగా సేవలు అందించారని, మెదక్ స్థానం నుంచి వరుసగా మూడుసార్లు ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించారని వివరించారు. సైదాబాద్‌లో 'ఇందిరా సేవా సదన్' నెలకొల్పి వేలాది మంది పేద బాలికలకు ఆశ్రయం, విద్య అందించిన మహోన్నత వ్యక్తి ఆమె అని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే విద్యాశాఖ ఉన్నందున, గతంలో విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన సంగం లక్ష్మీబాయి పేరును చంచల్‌గూడ – సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జ్‌కు నామకరణం చేస్తే ప్రజామోదం లభించడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని వీహెచ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజ్ఞప్తిపై తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని సీఎంను కోరారు.



# గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గతంలో కోర్టుకెళ్లిన మీరే.. ఇప్పుడు అవే భూములను ఎలా వేలం వేస్తారు?: సీఎంను ప్రశ్నించిన హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి)

నేడు ఓ లేఖ రాశారు. ఆగస్టు 17, 21 తేదీల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించ తలపెట్టిన వేలాన్ని తీవ్రంగా ఖండించారు.గతంలో ప్రభుత్వ భూములను పూర్వీకులు అందించిన జాతీయ సంపదగా అభివర్ణిస్తూ ఉద్వేగభరిత ప్రసంగాలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక అవే భూములను అమ్మకానికి పెట్టారంటూ హరీశ్ రావు వ్యాఖ్యానించారు. గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ పరిసరాలు, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను అమ్మేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ భూముల నుంచి రాయదుర్గంలోని వారసత్వ రాతి ప్రదేశాల వరకు తెలంగాణ విలువైన ప్రజా ఆస్తులకు ప్రమాదం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు."వేలం వేయాలని ప్రతిపాదించిన రాయదుర్గం పాన్‌మక్తా గ్రామంలోని సర్వే నంబర్ 83ని ఇప్పటికే హెరిటేజ్ సైట్‌గా ప్రకటించారు. దీని యాజమాన్య హక్కులపై ఎస్బీఐ, వక్ఫ్ బోర్డు మధ్య న్యాయవివాదాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి కేసులు పరిష్కారం కానప్పుడు థర్డ్ పార్టీ ప్రయోజనాలు కల్పించవద్దని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది" అని హరీశ్ రావు తన లేఖలో గుర్తుచేశారు. ఇదే భూముల పరిరక్షణ కోసం 2020లో రేవంత్ రెడ్డి కోర్టులను ఆశ్రయించారని చెప్పారు. "అప్పుడు కోర్టుకెక్కిన మీరే, ఇప్పుడు సీఎం అయ్యాక వివాదాస్పద ఆస్తిపై థర్డ్ పార్టీ హక్కులు ఎలా కల్పిస్తారు?" అని ప్రశ్నించారు.ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలను ఎకరాకు రూ. 237 కోట్ల చొప్పున వేలం వేయగా, ఆ భూమిపై ఎస్బీఐ యాజమాన్య హక్కులను ప్రకటించిందని, ఈ అంశం ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో విచారణలో ఉందని హరీశ్ రావు తెలిపారు. ఈ కేసు తేలకుండానే, అదే సర్వే నంబర్‌లోని మరో 10.63 ఎకరాలను వేలం వేయడం పరిపాలనా విచక్షణను, ప్రభుత్వ నిబద్ధతను ప్రశ్నిస్తోందని విమర్శించారు. భూమి యాజమాన్య హక్కులు చట్టబద్ధంగా తేలే వరకు ఎలాంటి వేలం, బదిలీ, రిజిస్ట్రేషన్ లేదా అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టవద్దని ఆయన డిమాండ్ చేశారు. వారసత్వ ఆస్తికి సంబంధించిన రికార్డుల గల్లంతుపై విచారణ జరిపించాలని, వక్ఫ్ రికార్డుల మాయంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. భవిష్యత్ తరాల కోసం ఈ విలువైన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం సందర్భంగా చంద్రబాబు తీవ్ర భావోద్వేగం

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన అన్నదాతలు చేసింది కేవలం భూత్యాగం మాత్రమే కాదని, రాబోయే తరాలకు, ప్రపంచానికే ఆలోచింపజేసే ఒక గొప్ప స్ఫూర్తినిచ్చారని సీఎం చంద్రబాబు కొనియాడారు. రాజధాని నిర్మాణంలో రైతులను నేరుగా భాగస్వాములను చేయాలనే మహోన్నత ఆలోచనతోనే తాము ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకొచ్చామని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఉంచిన నమ్మకంతో నోటిఫికేషన్ ఇచ్చిన కేవలం 58 రోజుల్లోనే 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి ఉదారత చూడలేమని చెబుతూ అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని వ్యాఖ్యానించారు.ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను స్మరించుకుంటూ, నాడు మనకు రాజధాని ఎక్కడ నిర్మించాలో, ఎటు వెళ్లాలో తెలియని గందరగోళం నెలకొందని తెలిపారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికలు, మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న అమరావతిని రాజధానిగా ఎంపిక చేశామని చెప్పారు. నాడు ఏమీ లేని శూన్యం నుంచి నేడు ప్రపంచం గర్వించే రీతిలో స్వయంగా రాజధానిని నిర్మించుకునే స్థాయికి చేరుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని ప్రస్తావిస్తూ... నాడు ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మిస్తుంటే చాలామంది హేళనగా మాట్లాడి ఎగతాళి చేశారని సీఎం గుర్తుచేశారు. కానీ నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందంటే ఒక నాయకుడిగా తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. నాడు చేసిన అభివృద్ధి వల్ల అక్కడ 42 శాతం మంది ప్రజలు బాగుపడ్డారని, మిగిలిన 58 శాతం ఉన్న మన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడా ఒక సమర్థవంతమైన, ప్రపంచస్థాయి రాజధాని కావాలనే దృఢ సంకల్పంతోనే అమరావతికి శ్రీకారం చుట్టానని స్పష్టం చేశారు. సైబరాబాద్ నిర్మాణం కోసం తాను అమెరికా వెళ్తే, అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరం కావాలని తొలిసారి సింగపూర్ వెళ్లానని చెప్పారు. ఈ నగరంలో కేబుళ్లు ఏవీ పైన కనిపించవని, పూర్తి పర్యావరణహితంగా ప్రపంచంలోనే నంబర్ వన్ గ్రీన్ సిటీగా అమరావతి నిలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో అమరావతిని కేవలం 'గ్రాఫిక్స్' అని విమర్శించిన వారు ఇప్పుడు ప్రత్యక్షంగా వచ్చి చూస్తే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి ఏంటో కళ్లకు కట్టినట్లు తెలుస్తుందని సూచించారు.ఈ మహోన్నత కార్యక్రమంలో మంత్రులు పి. నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సీఆర్‌డీఏ అధికారులు, వేలాది మంది అమరావతి రైతులు, స్థానికులు పాల్గొన్నారు.



తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల పొలం బాట





రుద్రంగి ఆగస్టు13(దేశ టైమ్స్)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ (7 వ తరగతి, 8 వ తరగతి) విద్యార్థులు క్షేత్ర పర్యటన లో భాగంగా రుద్రంగిలో గల స్థానిక రైతుల వద్దకు వెళ్ళి వ్యవసాయం,సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఆదేవిధంగా విద్యార్థులు స్వయంగా పొలంలో దిగి వరినారు నాట్లుగా వేసారు.విద్యార్థులు రైతుల యొక్క కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ హరీనాథ్ రాజ్ మాట్లాడుతూ, దేశానికి వెన్నుముక రైతు అని, రైతు కు గౌరవం ఇవ్వడం ప్రతీ పౌరుని బాధ్యత అని అన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అంటారు, అలాంటి అన్నం అందించే రైతు ఆ బ్రహ్మ కన్న గొప్ప అని విద్యార్థులకు తెలియజేశారు.

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి**

**బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**

**(దేశ టైమ్స్)మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 13**




ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ,ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని మరిపెడ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి సూచించారు.బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో గురువారం మరిపెడ మండలంలోని గాలివారిగూడెం,ఎల్లంపేట గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు.ఈ శిబిరాలకు డాక్టర్ గుగులోతు రవితో పాటు గాలివారిగూడెం సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి,ఎల్లంపేట సర్పంచ్ గండి రాధమ్మ,ఎంఎల్‌హెచ్‌పీలు సతీష్,అమిత హాజరయ్యారు.వైద్యులు సుమారు 280 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ.. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా,టైఫాయిడ్,వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఇంటి లోపల,బయట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పగటిపూట కుట్టే దోమల ద్వారా డెంగ్యూ వ్యాప్తి చెందుతుందని,ఈ దోమలు మంచినీటి నిల్వల్లో వృద్ధి చెందుతాయని తెలిపారు.ఇంటి పరిసరాల్లోని కుండీలు,కూలర్లు,ఉపయోగం లేని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.దోమల నియంత్రణతో వ్యాధులను అరికట్టవచ్చని,పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు.ప్రస్తుతం ఆహారపు అలవాట్లు,వాతావరణ మార్పులు,కాలుష్యం కారణంగా అనేక మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని డాక్టర్ రవి తెలిపారు.ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.బిజీ జీవనశైలి కారణంగా చాలామంది ఆరోగ్యంపై శ్రద్ధ చూపకపోవడంతో చిన్న వయసులోనే బీపీ,షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు.నిత్యం వ్యాయామం చేయడంతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవాలని,ఆరోగ్య నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీదేవి,కార్యదర్శులు మంజుల,స్వప్న,ఏఎన్ఎంలు హుస్సేన్ బి,విజయ,బాల వికాస సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర,జుజ్జూరి ఉపేంద్ర,గుగులోత్ కవిత, ఆశా వర్కర్లు జ్యోతి,మాధవి,గణిత, పార్వతి, రమాదేవి,జ్యోతి,ఉపేంద్ర, నీల,కారోబార్ హుస్సేన్,గ్రామ పెద్దలు,గ్రూప్ లీడర్లు,మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

**వెనుక నుంచి కారును ఢీకొట్టిన మరో కారు.. తప్పిన పెను ప్రమాదం**

**(దేశ టైమ్స్)మహబూబాబాద్/ మరిపెడ ఆగస్టు 13**

మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ప్రయాణిస్తున్న కారుకు గురువారం తృటిలో ప్రమాదం తప్పింది. మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారులోని రైస్‌మిల్లుకు వెళ్లే రహదారి వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. రెడ్యానాయక్ ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొనడంతో వాహనం వెనుక భాగం దెబ్బతింది. అయితే కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో కుటుంబ సభ్యులు, అనుచరులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. స్థానికుల వివరాల ప్రకారం రెడ్యానాయక్ కారులో అబ్బాయిపాలెం శివారులోని రైస్‌మిల్లుకు వెళ్లే రహదారిలో ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో ముందుగా వెళ్తున్న ఓ ద్విచక్రవాహనం అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుంది. దీంతో రహదారిపై ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో ఎదురుగా కొందరు కూలీలు వస్తుండటంతో వారిని తప్పించేందుకు రెడ్యానాయక్ కారు డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నెమ్మదించాడు.అయితే వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో కారు డ్రైవర్ ముందున్న వాహనాన్ని గమనించి అదుపు చేసుకునేలోపే రెడ్యానాయక్ ప్రయాణిస్తున్న కారును వెనుక వైపు ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఢీకొట్టడంతో రెడ్యానాయక్ కారుకు వెనుక భాగంలో నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో అక్కడున్న వారు ఆందోళనకు గురయ్యారు.

**ఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్థులు**

ప్రమాద విషయం తెలుసుకున్న అబ్బాయిపాలెం, ధారావత్‌తండా గ్రామస్థులు, రెడ్యానాయక్ అనుచరులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారును పరిశీలించి మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ క్షేమంగా ఉన్నారని తెలుసుకుని పరామర్శించారు. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

**తప్పిన పెను ప్రమాదం**

రహదారిపై వాహనాల రాకపోకలు జరుగుతున్న సమయంలో ముందుగా వెళ్తున్న ద్విచక్రవాహనం అకస్మాత్తుగా మలుపు తిప్పడం, ఎదురుగా కూలీలు రావడం, వెనుక నుంచి మరో కారు వేగంగా రావడం వంటి పరిణామాలు ఏకకాలంలో చోటుచేసుకోవడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే రెడ్యానాయక్ కారు డ్రైవర్ అప్రమత్తంగా వాహన వేగాన్ని తగ్గించడంతో ఎదురుగా ఉన్న వారిని తప్పించగలిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో వాహనం దెబ్బతిన్నప్పటికీ ప్రాణనష్టం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి కారణమైన పరిస్థితులు, వాహనాల వేగం తదితర అంశాలపై అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.










# వర్షాభావాన్ని అధిగమించేందుకు పంటల వైవిధ్యం

**నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి**

**జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర**

**(దేశ టైమ్స్)మహబూబాబాద్/మరిపెడ, ఆగస్టు 13:**




వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు పంటల వైవిధ్యాన్ని పాటిస్తూ తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర సూచించా రు. కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం మరిపెడ మండల కేంద్రంలోని మరిపెడ క్లస్టర్‌లో 'మిషన్ వైవిధ్యం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌చంద్ర మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా పెసర, కంది, మినుములు వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి కొరతను అధిగమించవచ్చన్నారు. అదే సమయంలో పంట పెట్టుబడులను కూడా తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై కూడా దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా నీటి వినియోగాన్ని ఆదా చేయడంతో పాటు దీర్ఘకాలంలో అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. నీటి వనరులు, భూమి స్వభావం, మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. కూరగాయల సాగుతో నిరంతర ఆదాయం పొందే అవకాశం ఉంటుందని విజయ్‌చంద్ర తెలిపారు. వివిధ రకాల కూరగాయలను దశలవారీగా సాగు చేయడం ద్వారా తరచుగా దిగుబడులు పొందుతూ రైతులు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాలను తగ్గించుకోవడానికి పంటల వైవిధ్యమే ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ డివిజన్ టెక్నికల్ ఏవో శ్రీదేవి, హార్టికల్చర్ హెచ్‌వో శాంతిప్రియ, ఏఈవోలు ఎన్.శ్రీకాంత్, పి.అన్వేష్, బి.అశోక్, డి.చరణ్, జె.స్రవంతి, సరితతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# రుద్రంగి బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

రుద్రంగి ఆగస్టు13(దేశ టైమ్స్)




రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కర్ణావత్తుల వేణు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సంద ర్భంగా మాట్లాడు తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ చెప్పట్టడం జరిగిందన్నారు. ప్రజలలో దేశభక్తిని పెంచడమే లక్ష్యంగా, దేశం కోసం పోరాడిన వ్యక్తులను స్మరించుకోవడం కోసం ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. 2047 వరకు ప్రపంచంలో భారత దేశాన్ని విశ్వగురువుగా ఎదగడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంతో ముందుకు వెళ్తున్నారని అన్నారు. జెండా పట్టుకుంటే ర్యాలీ అవుతుంది.గుండెలో ఉంటే దేశ భక్తి అవుతుందన్నారు. ప్రతి ఒక్క పౌరుడు తమ ఇంటిపై జాతియ జెండాను ఎగురవేయలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో,బిజెపి నాయకులు,కార్యకర్తలు, యువకులు,పాల్గొన్నారు

# బాలయ్య దశదినకర్మలో పాల్గొన్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

వలిగొండ ఆగస్టు13:(దేశ టైమ్స్)

ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధమల్ల బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా గురువారం ఆయన స్వగ్రామం లింగరాజుపల్లిలో దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారుల ఫోరం నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి మాట్లాడుతూ గంధ మల్ల బాలయ్య ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఉద్యమకారుల ఫోరం ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చేవాడని ఆయన స్ఫూర్తితో ఉద్యమకారుల హక్కులు సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, బీసి సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి, ఉద్యమకారుల ఫోరం నాయకులు బొడిగెసుదర్శన్, ఫోరం జిల్లా నాయకులు బొడ్డుపల్లి లింగయ్య, కదిరేని స్వామి, రామన్నపేట ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు నోముల శంకర్ ,కొండూరు సత్తయ్య, నీలమ్మ, ఎదురుగట్ల యాదగిరి, పల్లెర్ల రామచందర్, సందయ్య,లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.






తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## మండల సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**వలిగొండ ఆగస్టు13:(దేశ టైమ్స్)**



మండలంలోని వివిధ గ్రామాలు సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని సి పి ఐ మండల కార్యదర్శి సలిగంజి వీర స్వామీ అన్నారు. గురువారం సి పి ఐ ఆధ్వర్యంలో రెండవరోజు ప్రజా చైతన్య యాత్ర వేములకొండ వెంకటాపురం, ఆరూరు, నాగారం గొల్లపల్లి, సంగేం,గోకారం , టేకుల సోమవారం, పహిల్వాన్ పురం, రెడ్ల రేపాక,మీదగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తుందని, రైతుబంధు , రుణమాఫీ ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, మహిళలకు వంటగ్యాస్ ప్రతి మహిళలకు 2500 రూపాయలు, తులం బంగారం సంక్షేమ పథకాలు అమలు జరపటంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది అని అన్నారు. మూసి ప్రక్షాళన సత్వరమే చేయాలని మండల వ్యాప్తంగా బస్వాపురం రిజర్వాయర్ ద్వారా సాగు త్రాగునీరు అందించాలని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, మండల కార్యవర్గ సభ్యులు ఎలగందుల అంజయ్య, సల్వాద్రి రవీందర్,పోలేపాక యాదయ్య, పులిపల్పుల మల్లేశం, అంబటి అంజయ్య, సుద్దాల సాయికుమార్, ఆకుల శ్రీను, వద్దేగాని శంకరయ్య, బుంగ చక్రం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని MRO కి వినతి

**వలిగొండ ఆగస్టు13(దేశ టైమ్స్)**



ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వీ=ా దశరథ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భముగా పలువురు మాట్లాడుతూ పిఆర్సి ప్రకటించి వెంటనే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆరు డి ఏ లను మంజూరు చేయాలని, పాఠశాలల మూసివేత ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, లింగయ్య, ప్రభాకర్, జిలాని,నాగేందర్, బిక్షపతి, లింగయ్య,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## సినిమా రంగంలో అతి పెద్ద వయసు 'జెన్ జీ' నేనే: కమల్ హాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు

విలక్షణ నటుడు కమల్ హాసన్ సినీ రంగ ప్రవేశం చేసి 67 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. దశాబ్దాల అనుభవం ఉన్నప్పటికీ, మారుతున్న చిత్ర పరిశ్రమకు అనుగుణంగా నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని చెబుతూ.. తనను తాను సినిమా రంగంలోని "అత్యంత పెద్ద వయసు జెన్" (Oldest of Gen Z) గా అభివర్ణించుకున్నారు.ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా కమల్ హాసన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. "నా 67 ఏళ్ల సినీ ప్రస్థానానికి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ 67 ఏళ్లలో నేను నిజంగా నేర్చుకున్నది కేవలం 20 సంవత్సరాలే అని భావిస్తున్నాను. మిగిలిన సమయం మురుగునీటి ప్రవాహంలో కొట్టుకుపోవడమే. కళాకారులు, ప్రేక్షకులు అందరం కలిసికట్టుగా సినిమా అనే సముద్రంలో కలిసేందుకు ప్రవహిస్తున్నాం. అదొక గొప్ప ఆశ" అని తనదైన తాత్విక ధోరణిలో పేర్కొన్నారు.అంతేకాదు, సినిమా చరిత్రను కూడా ఆయన గుర్తుచేశారు. "1895 డిసెంబర్‌లో లూమియర్ బ్రదర్స్ తొలిసారిగా చిత్రాన్ని ప్రదర్శించారు. అప్పటి నుంచి సినిమా పరిశ్రమకు సుమారు 130 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ మొత్తం సినీ చరిత్రలో సగానికి పైగా, అంటే 67 ఏళ్లుగా నేను ఈ రంగంలోనే ఉన్నానని నా బృందం గుర్తు చేసింది. ఇది నమ్మశక్యం కాని ఆలోచన. అయినా నేను నేర్చుకున్నది 20 ఏళ్లే" అని ఆయన తన పోస్టులో వివరించారు.కమల్ హాసన్ కేవలం ఆరేళ్ల వయసులో "కళత్తూర్ కన్నమ్మ" చిత్రంతో బాలనటుడిగా వెండితెర అరంగేట్రం చేశారు. తొలి చిత్రానికే రాష్ట్రపతి స్వర్ణ పతకాన్ని గెలుచుకుని చరిత్ర సృష్టించారు. అప్పటి నుంచి నేటి వరకు తమిళ, తెలుగు, మలయాళ, హిందీ, కన్నడ, బెంగాలీ భాషల్లో 230కి పైగా చిత్రాల్లో నటించి భారతీయ సినిమా గర్వించదగ్గ నటులలో ఒకరిగా నిలిచారు. 67 ఏళ్ల తర్వాత కూడా నేర్చుకోవాలనే తన తపనను ఈ పోస్ట్ ద్వారా ఆయన చాటుకున్నారు.



## అంగన్వాడీ వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జగిత్యాల ప్రాజెక్ట్ అధికారి జయప్రద,





**దేశ టైమ్స్ :**

భీమారం మండలం మన్నెగూడెం గ్రామం లోని 4 అంగన్వాడీ కేంద్రాలను సీడీపీఓ జయప్రద తనిఖీ చేసారు, పిల్లలతో ప్రీస్కూల్ ఆక్టివిటీస్ చేయించి, పిల్లల భోజనం పరిశీలించి టీచర్స్ అందరికి పాలు సూచనలు, సమయ పాలన పాటించి ప్రీస్కూల్ కార్యక్రమాలు చేయిస్తూ ప్రతి నెలలో ఒక రోజు సర్పంచ్ సమక్షంలో తల్లుల సమావేశం ఏర్పాటు చేసి బాలామృతం, ఎగ్స్ పంపిణి చేయించి పిల్లల బరువులు పరిశీలించి ఆహార ఆరోగ్య విషయాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సూపర్వైజర్ షైని మాథ్యూ, అంగన్వాడీ టీచర్స్ వినోద, కవిత, రమ ఆయా మమత తదితరులు పాల్గొన్నారు.

## బునాదిగాని కాలువ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే కుంభం.





**(యాదాద్రి కరస్పాండెంట్ )**

**దేశ టైమ్స్, ఆగష్టు 13.**

భువనగిరి నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ బునాదిగాని కాలువపై చేపట్టిన కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తికావడంతో, బీబీనగర్ మండలం మక్త అనంతారం వద్ద బునాదిగాని కాలువ నీటిని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురు వారం విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు సాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాలువల అభివృద్ధి, ఆధునీకరణ, అవసరమైన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని,బునాదిగాని కాలువ పరిధిలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలిగించే ప్రాంతాలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులను పూర్తి చేసి, కాలువ నీటిని విడుదల చేయడం జరిగిందని,కాలువ ద్వారా విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు సక్రమంగా చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నీటి ప్రవాహంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పొట్టోల శ్యామ్ గౌడ్, సీనియర్ నాయకులు పంజాల రామాంజనేయులు, గోలి పింగల్ రెడ్డి, గోలి నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్, డైరెక్టర్ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మండల నాయకులు,సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఈ ఈ శైలేందర్, డి ఈ లావణ్య,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో విల్లా.. ముంబైలో ఫ్లాట్లు.. ప్రీతి జింటా ఆస్తులు ఎంతో తెలుసా?

ఒకప్పుడు బాలీవుడ్ అగ్ర కథానాయికగా రాణించిన ప్రీతి జింటా, సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి వెండితెరపై సందడి చేయనున్నారు. ఆమిర్ ఖాన్ నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న 'బట్వారా 1947' అనే చారిత్రక చిత్రంతో ఆమె రీఎంట్రీ ఇస్తున్నారు. సన్నీ డియోల్, షబానా అజ్మీ, కరణ్ డియోల్, అలీ ఫజల్ వంటి ప్రముఖ నటులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 14న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో, ప్రీతి జింటాకు ఉన్న భారీ ఆస్తులు, ముఖ్యంగా ఆమె రియల్ ఎస్టేట్ పెట్టుబడుల వివరాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.ప్రస్తుతం ప్రీతి తన భర్త జీన్ గుడ్‌ఎనఫ్, పిల్లలు జై, జియాలతో కలిసి అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో నివసిస్తున్నారు. అక్కడ వారికి సుమారు రూ. 40 కోట్ల విలువైన అత్యంత విలాసవంతమైన విల్లా ఉంది. విశాలమైన పెరడు, భారీ కిటికీలతో కూడిన ఈ నివాసానికి సంబంధించిన ఫోటోలను ఆమె అప్పుడప్పుడు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ ఉంటారు.భారత్‌లో, ముఖ్యంగా ముంబైలోని అత్యంత ఖరీదైన పాలి హిల్ ప్రాంతంలో ప్రీతి జింటా భారీస్థాయిలో ఆస్తుల క్రయవిక్రయాలు జరిపారు. 2023 అక్టోబర్‌లో అక్కడ 1,474 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసిన ఆమె, ఆ తర్వాత 2025 నవంబర్‌లో దాదాపు అదే పరిమాణమున్న ఒక ఫ్లాట్‌ను రూ. 14 కోట్లకు పైగా ధరకు విక్రయించారు. అదేవిధంగా, ఈ ఏడాది మార్చి నెలలో అదే భవనంలోని 1,770 చదరపు అడుగుల మరో ఫ్లాట్‌ను రూ. 18.5 కోట్లకు విక్రయించడం గమనార్హం.ఇటీవల 2026 జూన్‌లో, ఆమె పాలి హిల్‌లోని 'ఆర్ట్ వేదా' భవనంలో నెలకు రూ. 6 లక్షల అద్దెతో కూడిన నూతన అపార్ట్‌మెంట్‌లోకి మారారు. వీటితో పాటు, ముంబైలో అద్దె ఆదాయాన్నిచ్చే వాణిజ్య సముదాయాలు, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఆమెకు నివాస గృహాలు ఉన్నాయి. సమాచారం ప్రకారం, ప్రీతి జింటా మొత్తం నికర ఆస్తుల విలువ సుమారు రూ. 183 కోట్లుగా అంచనా. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, ఐపీఎల్ ఫ్రాంచైజీ సహ యజమానిగా, సమర్థవంతమైన ఇన్వెస్టర్‌గా ఆమె తన సంపదను విజయవంతంగా వృద్ధి చేసుకుంటున్నారు.



Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280